సాక్షి
మెదక్
గురువారం। 10। ఏప్రిల్। 2025



సన్నాల సాగుకే సై

సన్న బియ్యం పంపిణీ, బోనస్‌తో రైతులు సన్నాల సాగుకు సై అంటున్నారు.

వివరాలు 8లో ▸



10 గుంటలు.. 15 బోర్లు

10 గుంటలలో 15 బోరు బావులు ఉండగా, సుమారు 120 ఎకరాలు సాగవుతున్నాయి.

వివరాలు 8లో ▸



మూగజీవాల గోస

వేసవిలో మూగజీవాలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

టేక్మాల్ (మెదక్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. కేజీబీవీలో ఇంటర్ విద్య ఎందుకు లేదని సిబ్బందిని ప్రశ్నించారు. గదుల కొరతతో 10వ తరగతి వరకు మాత్రమే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బాలమణి, టీచర్లు ఉన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు 2024 నుంచి తగ్గాయని, ఇటీవలి కాలంలో మరింత తగ్గాయని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్‌పై రూ. 50 పెంచడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగే గ్యాస్ ధరల ప్రభావం నిత్యావసరాలపై పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం, నాయకులు మహేందర్‌రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, నాయకులు భాను, సత్యం, రాణి, మల్లయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ధరణి సమస్యల పరిష్కారం

మెదక్ కలెక్టరేట్: ధరణి సమస్యలను పక్కా ప్రణాళికతో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ధరణి సమస్యలపై అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ధరణి సమస్యలపై దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తప్పని చిల్లర కష్టాలు



మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వ్యాపారులను చిల్లర నాణేల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసినా.. దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసినా సరిపడా చిల్లర ఇవ్వడం లేదు. చిల్లరే కదా అని కొందరు వదిలేస్తుంటే... మరికొందరు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో వ్యాపారులు ఇతర సరుకులు, చాక్లెట్లు అంటగడుతున్నారు. ఇలాంటి సమస్యను తట్టుకునేందుకు వ్యాపారులు రూ. 100కు రూ. 5 చొప్పున కమీషన్ ఇస్తూ చిల్లర తెచ్చుకుంటున్నారు. దేవాలయాల హుండీ లెక్కింపు సమయంలోనూ చిల్లర నాణేల సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు సమాచారం. మరోవైపు మార్కెట్‌లో రూ. 10, రూ. 20 నోట్లు వినియోగదారులకు సరిపడా లభించడం లేదు. బ్యాంకులు ప్రజల అవసరాలకు సరిపడా చిల్లర నాణేలు సరఫరా చేయాలని వ్యాపారులు కోరుతున్నారు. అయితే ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ ధరలు చిల్లరలో లేకుండా చేసినట్లు తెలిసింది. రూ. 10, 20, 30 ఇలా పదుల్లోనే టిక్కెట్ ఇస్తున్నారు. అయినప్పటికీ రూ. 10, రూ. 20 నోట్ల సమస్య ఉత్పన్నమవుతోంది. ఇలాంటి సమయంలో కండక్టర్లు తోటి ప్రయాణికులకు లింకులు పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రూ. 10 కాయిన్స్ పెద్ద మొత్తంలో రావడంతో కొంచెం సమస్య తీరినట్లు సమాచారం.

మందుల దందా!

మెడికల్ షాపులపై కరువైన నిఘా

- ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు
- బ్రాండెడ్ ముసుగులో జనరిక్ మందుల విక్రయం
- నెలకు రూ. 20 కోట్లకు పైగా వ్యాపారం
- చోద్యం చూస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు





ఈ చిత్రంలోని వ్యక్తి పేరు జనార్దన్. ఈనెల 5వ తేదీన మెదక్ పట్టణంలోని ఆటోనగర్ వీధిలో గల ఓ మెడికల్ షాపులో స్కిన్‌లోషన్ కొనుగోలు చేశాడు. దాని ఎమ్మార్పీ ధర రూ. 250 కాగా, సదరు నిర్వాహకుడు రూ. 315 అని చెప్పాడు. ఇదేంటని ప్రశ్నించగా మీ ఇష్టం ఉంటే తీసుకోండి, లేదంటే మానేయండి అన్నాడు. దీంతో గత్యంతరం లేక కొనుగోలు చేశాడు.

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 528 మెడికల్ షాపులు ఉండగా, అనధికారికంగా మరో 100కు పైగా కొనసాగుతున్నాయి. ఇందులో సగానికి పైగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. బ్రాండెడ్ ముసుగులో జనరిక్ మందులను అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉండగా జిల్లావ్యాప్తంగా నెలకు రూ. 20 కోట్లకుపైగా మందుల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది.

అనుమతి లేకుండా నిర్వహణ

కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు హైదరాబాద్ నుంచి స్పెషలిస్టుల పేరుతో ఎలాంటి అనుమతి లేకుండానే వైద్యులను తీసుకొస్తున్నారు.



ఆటోనగర్ వీధిలోని ఓ మెడికల్ షాపులో లోషన్ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయం

రోగులు భారీగా వచ్చేలా ప్రచారం చేసి వైద్యుల ద్వారా మందులు సేల్ చేసుకుంటున్నారు. వాస్తవానికి మెడికల్ షాపు నిర్వహించాలంటే డ్రగ్ అధికారి అనుమతి తప్పనిసరి. ఆస్పత్రి కొనసాగించాలంటే డీఎంహెచ్ఓ అనుమతి తీసుకోవాలి. కానీ జిల్లాలో చాలా మంది మెడికల్ షాపుల నిర్వాహకులు అవేం పట్టించుకోవడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కిఇష్టారాజ్యంగా మందులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కమీషన్ మాయాజాలం

జిల్లాలో మందుల విక్రయం వ్యాపారంగా మారింది. మా కంపెనీకి చెందిన రూ. కోటి విలువ చేసే మందులు సేల్ చేస్తే అందులో రూ. 40 శాతం కమీషన్ ఇస్తామని నిర్వాహకులు వైద్యులతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో వైద్యులు ఆ కంపెనీ మందులు సేల్ చేసేందుకు అవసరం ఉన్నా లేకున్నా రోగుల నెత్తిన రుద్దుతున్నారు. కంపెనీ విధించిన టార్గెట్‌ను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నారు తప్ప, సేవ చేయాలనే దృక్పథం ఏ మాత్రం వారిలో కనిపించడం లేదు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

మందులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపు అనుమతులు రద్దు చేయటంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– చంద్రకళ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, మెదక్

సంతృప్తిగా సన్నబువ్వ

కలెక్టర్ రాహుల్‌రాజ్



లబ్ధిదారుడి కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్(మెదక్): సన్నబియ్యంతో భోజనం సంతృప్తిని ఇచ్చిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని చంద్రు తండాలో పంచాయతీ కార్మికుడు రమావత్ పీరియ ఇంట్లో సన్నబియ్యం భోజనం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉగాది సందర్భంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదవారి కళ్లలో స్వయంగా ఆనందాన్ని చూశానని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాక్ చేరినట్లు వివరించారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీఓ విఠల్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఎంపీఓ రియజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అధికారికంగా పూలే జయంతి

మెదక్ కలెక్టరేట్: ఈనెల 11వ తేదీన మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ధ్యాన్‌చంద్ చౌరస్తాలో గల జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో క్రికెట్, మరే ఇతర బెట్టింగులకు పాల్పడినా, ప్రోత్సహించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో ఐపీఎల్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై నిఘా పెట్టాలన్నారు. ఎవరైన బెట్టింగులకు పాల్పడినట్లుగా తెలిస్తే తక్షణమే డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712657888 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

లబ్ధిదారులు అప్పుల పాలు కావొద్దు

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకొని అప్పుల పాలు కావొద్దన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన కొచ్చెరువు తండాలో ఆయన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అధికారుల నిబంధనల మేరకు నిర్మించుకుంటే స్థలం సరిపోకుండా ఉందని, చెల్లించాల్సిన డబ్బులు చెల్లిస్తే మిగితా డబ్బులు వేసి నిర్మించుకుంటామని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీలైనంత వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని ప్రజలకు సూచించారు. అనంతరం పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, శ్రీనివాస్, తండా వాసులు శ్రీనునాయక్, రెడ్యా, అమ్రియా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ జరగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడియారం, అనంతసాగర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేసి సకాలంలో రైతులకు ధాన్యం డబ్బులు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం రుక్మాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణలో పాల్గొన్నారు. అలాగే కసాన్‌పల్లి దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి సరిహద్దులోని రామాయంపేట కెనాల్‌ను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ఉప కాల్వలు పూర్తి చేయించి చెరువుల్లో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఎంపీడీఓ చిన్నారెడ్డి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సన్న బియ్యం పంపిణీని తాము స్వాగతిస్తున్నామని, అయితే నాణ్యమైన బియ్యం అందజేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందజేస్తున్న సన్న బియ్యంలో 30 నుంచి 40 శాతం వరకు నూకలు వస్తున్నాయని తెలిపారు. మరికొన్ని దుకాణాల్లో సన్నబియ్యంలో దొడ్డు రకం బియ్యం కలిసి ఉంటున్నాయని వాపోయారు. నాణ్యమైన సన్న రకం బియ్యమే అందరికీ అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి వారికి సైతం సన్న బియ్యం అందించాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల సంఖ్యను కుదించవద్దని కోరారు. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రేషన్ దుకాణాలను కాంగ్రెస్ కార్యాలయాలుగా మారుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, భిక్షపతి, ప్రసాద్, ఆంజనేయులుగౌడ్, సద్దాం తదితరులు ఉన్నారు.

జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు



జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): అక్రమార్కుల ధన దాహానికి గుట్టలు కరిగిపోతున్నాయి. గత వారం రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన మైనింగ్ రుసుముకు గండి పడుతోంది. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిని అనుకొని ఉన్న 1421 సర్వే నంబర్‌లో 764 ఎకరాల మేర ప్రభుత్వ భూములున్నాయి. పట్టణానికి దూరంగా ఉండటంతో పాటు ఆప్రాంతంలో జనసంచారం లేకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా నెలల తరబడి మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెలుతుండటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ఈ సర్వే నంబర్‌లో గుట్ట పైభాగంలో జేసీబీ తవ్వకాలతో పెద్దఎత్తున ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. గతంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి గాను స్థలం ఎంపిక కోసం వచ్చిన క్రమంలో ఈ గుంతలను పరిశీలించారు. కాగా జిల్లా పరిధిలో మట్టి తవ్వకాల విషయమై ఆయా మండలాల్లో అధికారులు కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తుండగా, రామాయంపేటలో మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయమై తహసీల్దార్ రజనికుమారి వివరణ కోరగా.. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా మట్టి తవ్వితే సదరు వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సుస్థిరాభివృద్ధిలో మన పల్లెలు

- ఉమ్మడి జిల్లాలో బీ గ్రేడ్‌లో 24, సీ గ్రేడ్‌లో 1,419, డీ గ్రేడ్‌లో 171 జీపీలు
- ఏ పంచాయతీకి దక్కని అచీవర్స్ హోదా

గ్రేడ్	మార్కులు	గ్రామ పంచాయతీలు
ఏ(అచీవర్స్)	90 - 100	0
బీ(ఫ్రంట్ రన్నర్స్)	75 - 89	24
సీ(పెర్ఫార్మర్)	60 - 74	1,419
డీ(యాస్పిరెంట్)	40 - 59	171
ఈ(బిగినర్)	39	01

ప్రగతి ఆధారంగా పంచాయతీరాజ్ మార్కులు



మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని వల్లూరు గ్రామం తొమ్మిది అంశాలలో ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణతోపాటు వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, తాగునీటి సరఫరాను అద్భుతంగా నిర్వహిస్తున్నారు. దీంతో 77.90 మార్కులు సాధించింది. దీంతో గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: పేదరిక నిర్మూలన, జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన వంటి తొమ్మిది అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచి మెతుకుసీమలోని 24 పల్లెలు పురోగతిలో ఫ్రంట్‌రన్నర్‌గా నిలిచాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022–23 నాటికి దేశంలోని గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా మార్కుల జాబితాలను కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు గణనీయమైన మార్కులు సాధించాయి.

తొమ్మిది అంశాల ఆధారంగా...

కేంద్రప్రభుత్వం పంచాయతీ ముందస్తు సూచి(అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్) పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని 1,615 గ్రామ పంచాయతీలు దరఖాస్తు చేశాయి. పేదరిక నిర్మూలన, పంచాయతీలలో జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల కల్పన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళల స్వావలంబనకు అనుకూలమైన విధానాలు అనే అంశాల ఆధారంగా గ్రామ పంచాయతీలకు దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం మార్కులను కేటాయించింది. ఇందులో 24 పంచాయతీలు ఫ్రంట్‌రన్నర్‌గా నిలవడం విశేషం. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏ పంచాయతీకీ అచీవర్స్ హోదా దక్కలేదు. ప్రస్తుతం గౌరవెల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన గ్రామం గుడాటిపల్లి 39.39 మార్కులతో 'ఈ'గ్రేడ్‌లో నిలిచింది. అలాగే బీ గ్రేడ్‌లో నిలిచిన పటేల్‌గూడ, సుల్తానాపూర్ గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి.

అన్నింటా ఆదర్శంగా..

సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామం అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 939 గృహాలుండగా 3,184 జనాభా ఉన్నారు. 2009–10లో నిర్మల్ పురస్కారం, 2021లో పారిశుద్ధ్య నిర్వహణలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ జాతీయ అవార్డు వచ్చింది. గ్రామ పంచాయతీ భవనంపై సోలార్‌ను ఏర్పాటు చేసి సౌరవిద్యుత్‌ను వినియోగిస్తున్నారు. మిట్టపల్లి గ్రామం 77.59మార్కులు సాధించడంతో పంచాయతీ కార్యదర్శి విజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

ఫ్రంట్ రన్నర్స్‌గా నిలిచిన గ్రామ పంచాయతీలు ఇవే

మెదక్ జిల్లా

వల్లూర్(77.9), నారాయణపూర్(77.67), మనోహరాబాద్(75.2)

సంగారెడ్డి

పటేల్‌గుడా(79.67 మార్కులు), సూల్తానాపూర్(78.87), మైకోడ్(78.63), మల్చల్స్(78.3), చిటుకుల్(77.48), ఎద్దుమల్లారం(77.3),కొత్తాపూర్ (75.89), ఇలాపూర్(75.77), జనకంపేట్(75.18)

సిద్దిపేట

మిట్టపల్లి(77.59), చెక్కల్(77.24), అంగడి కిష్టాపూర్(77.5), బుస్సాపూర్(77.05), కట్కూర్(76.58) గురువన్నపేట(75.94), మల్లంపల్లి(75.9), రాఘవాపూర్(75.55), బైరాన్‌పల్లి(75.38), పొన్నాల(75.36), కుర్మెళ్ల(75.24)

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బ్యాతోల్‌ అటవీ ప్రాంతంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బ్యాతోల్‌ గ్రామానికి చెందిన రైతు రాజయ్య తన పశువులను అటవీ ప్రాంతంలో కట్టేసి వచ్చాడు. ఉదయం వెళ్లేసరికి చిరుత వచ్చి లేగదూడను చంపి తిని పడవేసినట్లు బాధితుడు తెలిపారు. ఘటనా స్థలాన్ని సెక్షన్‌ ఆఫీసర్‌ స్రవంతి, బీట్‌ ఆఫీసర్‌ అశ్వక్‌ పరిశీలించి వెటర్నరీ అధికారులతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి చిరుతపులి దాడి చేసినట్లు పోస్టుమార్టంలో వెటర్నరీ అధికారులు గుర్తించారు. బాధిత రైతును ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని సెక్షన్‌ ఆఫీసర్‌ తెలిపారు. పులి సంచరిస్తుందన్న విషయాన్ని తెలుసుకున్న ప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. రైతులు రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లొద్దని అటవీ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): బావిలో పూడిక తీత పనులు చేస్తుండగా కాలుజారి పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం రేగొండ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. హుస్నాబాద్‌ మండలం గాంధీనగర్‌ గ్రామానికి చెందిన శివరాత్రి కనకయ్య(40) ఒడ్డెర కార్మికుడు. రేగొండ గ్రామానికి చెందిన రైతు బొడిగే మల్లయ్య బావి పూడికతీత పనుల కు వెళ్లాడు. 15 రోజులుగా పనులు చేస్తు న్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత బావి పైన మట్టి పెళ్లలు, బండరాళ్లు తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారి కాలు జారి బావిలో పడి తీవ్ర గాయాల పాలయ్యా డు. 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం కనకయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌ పేర్కొన్నారు.



కనకయ్య(ఫైల్‌)

చికిత్స పొందుతూ వివాహిత..

శివ్వంపేట(నర్సాపూర్‌): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన చెల్లి వినోద(32) కుటుంబ కలహాలతో ఆరు రోజుల కిందట పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. అత్తింటి వేధింపులతోనే వినోద ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. కూతురి మృతికి కారకులైన అత్తింటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి తండ్రి దాకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితుడికి జైలు శిక్ష

నంగునూరు(సిద్దిపేట): గుడిలో దొంగతనం చేసిన వ్యక్తికి సిద్దిపేట అదనపు జ్యుడిషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ తరణి ఏడాదిపాటు జైలు శిక్ష విధించినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్‌ తెలిపారు. కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన బోదాసు యాదగిరి ఎనిమిది నెలల కిందట నంగునూరు మండల గట్లమల్యాలలోని పెద్దమ్మ గుడిలో దోపిడీకి పాల్పడ్డాడు. రూ.35 వేల నగదుతో పాటు బంగారం, ఇత్తడి గంటను దొంగిలించాడు. విచారణ అనంతరం నిందితుడిని గుర్తించి చార్జీషీట్‌ దాఖలు చేయడంతో రూ.500 జరిమానతోపాటు సాధారణ జైలు శిక్ష విధించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన బుధవారం మండల పరిధిలోని ఆకునూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉల్లెంగుల వెంకటేశ్‌ భార్య మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లింది. పొలం పనుల నిమిత్తం వెంకటేశ్‌ ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తిరిగి రాత్రి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.25 వేలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నీరేశ్‌ తెలిపాడు.

సన్నాల సాగుకే సై

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- వానాకాలంలో మరింత రెట్టింపు
- రెండేళ్లుగా స్పష్టంగా పెరుగుదల
- బోనస్‌ పథకంతో రైతులకు మేలు
- సన్న బియ్యం పంపిణీతో మరింత ధీమా

అన్నదాతలు సన్నాల సాగుకు సై అంటున్నారు. ఇంతకాలం దొడ్డు రకాలకు, సన్నరకాలకు ఒకే కనీస మద్దతు ధర ఉండటంతో గిట్టుబాటు కాదని భావించిన రైతులు బోనస్‌ పథకం అమలులోకి రావడంతో సన్నాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం కూడా ప్రారంభించడంతో రైతులకు మరింత ధీమా వచ్చింది. రానున్న వానాకాలంలో వరి సాగులో 70 శాతం వరకు సన్నాలే సాగవుతాయని, సన్నరకాల విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది.

– నారాయణఖేడ్‌



నారాయణఖేడ్‌లో సాగవుతున్న వరి పంట

2023–24 యాసంగిలో జిల్లాలో సన్నాలను 2,312 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. 2024– 25 యాసంగిలో సాగు విస్తీర్ణం 3,640కి పెరిగింది. 2024–25 వానాకాలం వచ్చేసరికి 5,474 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. రానున్న వానాకాలం 2025–26కు గాను గత వానాకాలం కంటే రెట్టింపుగా 10,948 ఎకరాలకు సన్నాల సాగు చేరవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విస్తీర్ణం కంటే అధికంగా పెరిగినా కూడా ఆశ్చర్యపోనవసరం లేదని పేర్కొంటున్నారు. గతంలో సన్నాల సాగు చూద్దామంటే కనిపించని పరిస్థితి చాలా నియోజకవర్గాల్లో ఉండేది. కానీ ప్రస్తుతం రైతులు మారుతున్న కాలంతో పాటు మార్పు దిశగా పయనిస్తూ సన్నాల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

బోనస్‌తో మేలు..

ప్రభుత్వం బోనస్‌ పథకం ప్రవేశపెట్టడంతో రైతులు సన్నాల సాగును పెంచేందుకు దోహదం అవుతుంది. కనీస మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ ఇస్తామని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,300 ఉండగా దానికి రూ.500 కలపడంతో రూ.2,800కు చేరింది. దీంతో బహిరంగ మార్కెట్లో ధరలు కూడా ఒక్కసారిగా పెరిగాయి. గత వానాకాలంలో జై శ్రీరాం లాంటి పలు రకాల సన్నాలకు మంచి డిమాండ్‌ పలికింది. జిల్లాలో డెల్టా, కావేరి, కోనవరం సన్నాలు, జగిత్యాల సన్నాలు, తెలంగాణ సోన (ఆర్‌ఎన్‌ఆర్‌ 15048) తదితర రకాలను సాగు చేస్తుంటారు. వ్యవసాయశాఖ 34 రకాల సన్నాలను గుర్తించింది. ముఖ్యంగా నల్గొండ లాంటి ప్రాంతాల్లో భారీ మిల్లులు ఉండటంతో అక్కడ మాశ్చర్‌ (తేమశాతం) 25 వచ్చినా కొనుగోలు చేస్తుండడం, జిల్లాలో 17 మాశ్చర్‌ (తేమశాతం) కావాలనడంతో రైతులకు కొంత నష్టదాయకమే. మాశ్చర్‌ విషయంలో మినహాయింపులు ఉండాలని రైతులు కోరుతున్నారు.

సన్నాలకు ‘చీడ’ సమస్య!

దొడ్డు రకం వరి ధాన్యంతో పోలిస్తే సన్న రకం వరి ధాన్యానికి చీడ పీడల సమస్య కాస్త అధికంగా ఉండనుంది. సన్నాలు, దొడ్డురకం రెండు పంటలూ 120 రోజుల కాలంలోనే కోతకు వస్తుంటాయి. సన్నాలకు మార్కెట్‌లో బోనస్‌తో కలిపితే ధర అధికంగా ఉంటుంది. అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు, ఆకుచుట్ట పురుగు తదితర తెగుళ్లు సోకే అవకాశాలు సన్నాలకు అధికంగా ఉంటాయి.

పెరిగిన సన్నాల వాడకం..

ఏడు నుంచి ఎనిమిదేళ్లుగా సన్న బియ్యం వాడకం విపరీతంగా పెరిగింది. పదేళ్ల కిందట వరకు రైతులు, గ్రామీణ స్థాయిల్లో దొడ్డు బియ్యం వాడకం కొనసాగేది. రైతులు తమ కమతాల్లో సాగైన బియ్యం తినేందుకే ఇష్టపడేవారు. కానీ కాలంతోపాటు సన్నాల కొనుగోళ్లు పెరగడంతో గ్రామీణ స్థాయిలో మధ్య తరగతి వర్గాల వరకు సన్న బియ్యంను కొనుగోలు చేసేందుకే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పీడీఎస్‌ బియ్యం కూడా జనాలు అమ్మేసి సన్న బియ్యం కొనుగోలు చేస్తుండడంతో దీన్ని నివారించేందుకు ప్రభుత్వమే సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెలలో పంపిణీ జరిగిన సన్న బియ్యంను జనాలు తినేందుకు ఇష్టపడుతున్నారు. రానున్న కాలంలో సన్నాల వినియోగమే అధికంగా మారనుండటంతో రైతులు కూడా అందుకు అనుగుణంగా సన్నాల వైపు మళ్లుతున్నారు.

సన్నాల విస్తీర్ణం పెరుగుతోంది



సన్నాల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. మూడేళ్ల కాలంతో పరిశీలిస్తే పెరుగుదల స్పష్టంగా కనిస్తుంది. ప్రభుత్వం రూ.500 బోనస్‌ ఇవ్వడం, పౌర సరఫరాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం, ప్రభుత్వ ప్రోత్సాహం, వ్యవసాయ అధికారుల ప్రచారం వల్ల సన్నాల సాగు పెరిగింది. చీడ పీడల సమస్య ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సలహాలు, సూచనలు పొందాలి. మంచి దిగుబడులు సాధించవచ్చు.

- నూతన్‌కుమార్‌, ఏడీఏ, నారాయణఖేడ్‌



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ సోలోమన్‌, ఆర్‌ఎం, డీఎం, తదితరులు

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

ఆర్టీసీ ఈడీ సోలోమన్‌

హుస్నాబాద్‌రూరల్‌: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని, ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికులు సహకరించాలని ఈడీ సోలోమన్‌ అన్నారు. బుధవారం రాత్రి హుస్నాబాద్‌ బస్టాండ్‌ డిపోను పరిశీలించారు. బస్టాండ్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌లో ఉన్న సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆదేశాల మేరకు హుస్నాబాద్‌ బస్టాండ్‌ను సందర్శించి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు సేవలందించడానికి ఆర్టీసీ ఉద్యోగులు ముందుంటారని చెప్పారు. హుస్నాబాద్‌ డిపో బస్టాండ్‌ అభివృద్ధి కోసం ఉద్యోగులతో సమీక్షించి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తామన్నారు. బస్టాండ్‌లో గతంలో నిర్మించిన మూత్రశాలల ఎత్తు పెంచడం, షాపింగ్‌ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసి ఆదాయ వనరులను పెంచుతామన్నారు. వీరి వెంట ఆర్‌ఎం రాజు, డిప్యూటీ ఆర్‌ఎం భూపతిరెడ్డి, డీఎం వెంకన్న ఉన్నారు.

జానపద సాహిత్యంపై జాతీయ సదస్సు



సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ సునీత, మట్టా సంపత్‌ కుమార్‌రెడ్డి, తదితరులు

15, 16 తేదీల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: జానపద సాహిత్య ఆద్య పరిశోధకులు ఆచార్య బిరుదు రాజు రామరాజు శత జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో 15, 16 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీత, సదస్సు కన్వీనర్‌ తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్‌ మట్టా సంపత్‌కుమార్‌ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జానపద సాహిత్యానికి తెలంగాణం కేంద్ర స్థానమని, ఇక్కడ ఉన్నంత జానపద సాహిత్య సంపద దేశంలో మరో ప్రాంతానికి లేదన్నారు. బిరుదురాజు రామరాజు తెలంగాణ జానపదసాహిత్యంపై చేసిన విశ్వవిద్యాలయస్థాయి డాక్టరేటు పరిశోధన దక్షిణ భారతదేశంలోనే మొదటిదన్నారు. అప్పటి నుంచి జానపద సాహిత్య సేకరణ, పరిశోధన నిర్విరామంగా నడుస్తుందన్నారు. ఈ సదస్సుకు రెండు తెలుగురాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌, ఢిల్లీతో పాటుగా ఇతర ప్రాంతాలనుంచి పరిశోధకులు పత్రసమర్పణలు చేస్తారన్నారు. ఈ రంగంలో విశేష పరిశోధనలు చేసిన ఆచార్యులు, పరిశోధకులు వక్తలుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త పిట్ల దాసు, కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అయోధ్య రెడ్డి, తెలుగుశాఖ అధ్యాపకులు సంపత్‌ కుమార్‌, నరేశ్‌, రామస్వామి, శైలజ, సాయి సురేశ్‌, నర్సింహులు, రమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి హాజరయ్యేందుకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్‌ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం శెట్టిపల్లికి చెందిన గడ్డం వీరయ్య(62), గడ్డం మల్లయ్య స్వగ్రామం శెట్టిపల్లి నుంచి బైక్‌పై మెదక్‌ వైపు పెళ్లికి వెళ్తున్నారు. మెదక్‌ మండలం తిమ్మక్కపల్లి శివారులోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వీరయ్య గుంతలోపడి అక్కడికక్కడే మృతి చెందగా, మల్లయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్‌ ఎస్‌ఐ మురళీ తెలిపారు.

అదృశ్యమైన పసి పాప ఎక్కడ..?

- మిస్సింగ్‌ కేసులో కొత్తకోణం వెలుగులోకి
- మంజీరాలో పడేసి చంపేశారంటూ ఒకరిపై మరొకరు ఆరోపణలు
- కొనసాగుతున్న కేసు దర్యాప్తు

కొల్చారం/చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): కొల్చారం మండలం సీతారాం తండాలో తల్లీకూతుళ్ల అదృశ్యం కేసులో తల్లి దొరికనప్పటికీ, పసి పాప కనిపించకపోవడంతో పలు అనుమానాలకు తావు ఇస్తోంది. బుధవారం చిలప్‌చెడ్‌ మండలం టోప్యా తండాలో చిన్నారి తల్లి గాయత్రీ, అంగన్‌వాడీ టీచర్‌ భూలి ఇద్దరి గొడవ కారణంగా కొత్త విషయాలు బయటకు వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సీతారాం తండాకు చెందిన సునావత్‌ రాజుకు చిలప్‌చెడ్‌ మండలం టోప్యా తండాకు చెందిన గాయత్రీతో ఏడాదిన్నర కిందట వివాహం జరిగింది. గాయత్రీకి రెండో వివాహం కాగా వీరికి నాలుగు నెలల చిన్నారి ఉంది. రాజు ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో కాపురంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో విసుగు చెందిన గాయత్రీ చిన్నారితో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ విషయం రాజు అత్తామామలకు చెప్పగా తమ వద్దకు రాలేదని తెలిపారు. జనవరి 20న గాయత్రీ తండ్రి రాత్ల దీప్లె పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ మహ్మద్‌గౌస్‌ దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయమై రాజు గాయత్రీ కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేశాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఓ అంగన్‌వాడీ టీచర్‌ సాయంతో గాయత్రీ తండ్రే కూతురుని, మనుమరాలిని అమ్మేశాడని ఆరోపించాడు. ఇది జరిగిన రెండు రోజులకే గాయత్రీని తండ్రి దీప్లె సీతారాం తండాకు తీసుకొచ్చాడు. చిన్నారిని తీసుకురాకపోవడంతో రాజు బంధువులు ప్రశ్నించారు. గాయత్రీకి రెండు పెళ్లిళ్లు చేసినా గొడవలు జరుగుతుండడం, వారి ఆర్థిక పరిస్థితి అంతంతగానే ఉండటంతో కూతురిని అమ్మేయాలని చూశాడని, మనుమరాలు అడ్డుగా ఉండటంతో నదిలో పడేశారనే వదంతులు వెలువడ్డాయి. తాజాగా బుధవారం చిన్నారిని అంగన్‌వాడీ టీచరే నదిలో పడేసిందని గాయత్రీ ఆరోపించగా, చిన్నారి తాత దీప్లనే నదిలో పడేశాడని అంగన్‌వాడీ టీచర్‌ తెలిపింది. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా కేసు దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పినట్లు సమాచారం.

నలుగురు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి మహిళ

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని రేజింతల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం సదాశివపేట సీఐ మహేష్‌ గౌడ్‌ కథనం మేరకు.. రేజింతల్‌ గ్రామానికి చెందిన మారేపల్లి లక్ష్మి(45) 7న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు కూలీలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఉస్మాన్‌నగర్‌లోని హాల్‌ మార్క్‌ లేబర్‌ క్యాంపులో నివాసముండే యశ్వంత్‌ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను పని చేస్తున్న ప్రదేశంలో 6వ తేదీన ఈరోజు పనికి రానని చెప్పి వెళ్లిపోయాడు. 7 నుంచి యశ్వంత్‌ ఆచూకీ లభించకపోవడంతో లింగన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే, ఒడిషా రాష్ట్రానికి చెందిన ప్రకాశ్‌ నాయక్‌ జీవనోపాధి నిమిత్తం నెల రోజుల కిందట తెల్లాపూర్‌లో ఉంటున్న అన్న వద్దకు వచ్చాడు. మై హోమ్‌ త్రీదశ లేబర్‌ క్యాంపులో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. గత నెల 31న అన్న బికాష్‌ నాయక్‌కు స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఇంటి కూడా రాలేదని తెలిసి వెతకగా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ అదృశ్యమైన ఘటన బొల్లారం పారిశ్రామికవాడలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌ కథనం మేరకు.. బీహార్‌ రాష్ట్రానికి చెందిన బిర్జుసా, భార్య సరితా దేవితో కలిసి స్థానిక బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య సరితా దేవికి మతిస్థిమితం బాగా లేదు. 8న రాత్రి సరితాదేవి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఉద్యాన సాగులో బయోడిగ్రేడబుల్‌ ప్లాస్టికల్చర్‌

- గ్లోబల్‌ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం
- ఉద్యానవర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌ దండ రాజిరెడ్డి
- బ్లైండ్‌ కలర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌తో యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్‌): ఉద్యాన వ్యవసాయ పంటల సాగులో పర్యావరణ అనుకూల బయోడిగ్రేడబుల్‌, కంపోస్టబుల్‌ ప్లాస్టిక్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ఉద్యానవర్సిటీ సంకల్పించిందని ములుగులోని కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌ దండ రాజిరెడ్డి అన్నారు. ఈ మేరకు ములుగు ఉద్యానవర్శిటీలో బుధవారం బ్లైండ్‌ కలర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ప్లాస్టికల్చర్‌తో అభివృద్ధి, శిక్షణ సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్లాస్టిక్‌ వాడకం గణనీయంగా పెరిగిందన్నారు. ఇవి భూమిలో క్షీణిస్తున్నప్పుడు మీథేన్‌, ఇథలీన్‌ వాయువులను విడుదల చేసి గ్లోబల్‌ వార్మింగ్‌ను మరింత పెంచుతుందన్నారు. ప్లాస్టిక్‌ కాలుష్యం నేలను నిస్సారం చేసి పంట దిగుబడిని తగ్గిస్తుందన్నారు. కలుపు మొక్కల అణచివేత, తేమ నిలుపుదల కోసం సాంప్రదాయ ప్లాస్టిక్‌ మల్చ్‌ ఫిల్మ్‌లు వాడకుండా బయోడిగ్రేడబుల్‌, కంపోస్టబుల్‌ ప్లాస్టిక్‌లు రైతులు వినియోగించేలా మార్పు తేవడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమన్నారు. ఇవి సులభంగా నేలలో కరిగిపోయి పర్యావరణ హానిని తగ్గించడంతో పాటు నేలను సుసంపన్నం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో ములుగు ఉద్యానవర్సిటీ, బ్లైండ్‌ కలర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, ప్లాస్టికల్చర్‌ అధికారులు భగవాన్‌, శుభం రతి, చీనానాయక్‌, లక్ష్మీనారాయణ, సురేశ్‌ కుమార్‌, రాజశేఖర్‌, శ్రీనివాసన్‌, వీణజోషి, సతీష్‌, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్‌

సంగారెడ్డి క్రైమ్‌: జిల్లాలో నెల రోజులుగా వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెలలో కొత్త బస్టాండ్‌ ఎదురుగా గల సాగర్‌ మెడికల్‌ దుకాణంతో పాటు, పక్కనే ఉన్న కేశవ మెడికల్‌ దుకాణాలే లక్ష్యం చేసుకొని ఓ వ్యక్తి వరుస చోరీలకు పాల్పడిన విషయం తెలిసిందే. మెడికల్‌ షాపులో ఉన్న నగదుతోపాటు విలువైన మందులను దొంగలించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన సంగారెడ్డి పట్టణ పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. అదుపులో ఉన్న నిందితుడిని స్పెషల్‌ బ్రాంచ్‌ పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

కాంట్రాక్ట్‌ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్‌ చేయాలి

సిద్దిపేట పీజీ కళాశాలలో పార్ట్‌ టైమ్‌ అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: సిద్దిపేటలోని యూనివర్సిటీ పీజీ కళాశాల (ఓయూ) పార్ట్‌ టైమ్‌ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారిని కాంట్రాక్ట్‌ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్‌ చేయాలని పార్ట్‌ టైమ్‌ అధ్యాపకులు అన్నారు. బుధవారం యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జీవో నంబర్‌ 21 కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని వెంటనే సవరించాలన్నారు. శాశ్వత నియామకాల కోసం విడుదల చేసిన జీవో నంబర్‌ 21లోని పార్ట్‌టైమ్‌ అధ్యాపకుల సేవకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఉన్నత విద్యా కమిషన్‌ అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా నెలకు రూ.50,000 కన్సాలిడేటెడ్‌ జీతం ఇవ్వాలన్నారు. పార్ట్‌ టైమ్‌ అధ్యాపకుల నిరసనకు కళాశాల కాంట్రాక్ట్‌ అధ్యాపకులు డాక్టర్‌ రమేశ్‌, డాక్టర్‌ సౌజన్య కుమార్‌, డాక్టర్‌ ఛత్రపతి, డాక్టర్‌ శ్రీహరి, రాజేందర్‌ మద్దతు తెలుపారు. కార్యక్రమంలో కళాశాల పార్ట్‌ టైమ్‌ అధ్యాపకులు డాక్టర్‌ సౌందర్య, స్వాతి, షంషాద్‌ అలీ, అశోక్‌, డాక్టర్‌ రత్నాకర చారి, డాక్టర్‌ సతీష్‌ కుమార్‌, డాక్టర్‌ శివ కుమార్‌ పాల్గొన్నారు.

10 గుంటలు.. 15 బోర్లు

‘ఉష్కెతెప్ప’తో పుష్కలంగా నీళ్లు

- పక్కపక్కనే బోర్లు వేసినా తగ్గని జలం
- సుమారు 120 ఎకరాల వరకు సాగు నీరు
- కిలో మీటరున్నర దూరం నుంచి పైపులైన్లు
- రైతులను ఆదుకుంటున్న పాంపల్లి సోమనికుంట చెరువు కింద ఉష్కెతెప్ప



ఉష్కెతెప్ప వద్ద ఒకే చోట బోర్లు

కౌడిపల్లి(నర్సాపూర్‌): ఒకే చోట పక్కపక్కనే పదిహేను బోర్లు. మీటరు స్థలంలో రెండు, నాలుగు మీటర్ల స్థలంలోనే నాలుగు బోర్లు. అయినా ఏ బోరులోనూ తగ్గని నీళ్లు. మండుటెండల్లో వేరే ప్రాంతాల్లో బోర్లు ఫెయిల్‌ అవుతున్నా ఇక్కడ చుక్క నీరు తగ్గదు. సుమారు 10 గుంటల స్థలంలో 15 బోరు బావులు ఉండగా గ్రామ రైతులకు చెందిన సుమారు 120 ఎకరాలు సాగు అవుతున్నాయి. నీళ్లు లేక ఎండిపోతున్న పంటలకు జీవం పోసింది కౌడిపల్లి మండలం పాంపల్లి గ్రామంలోని సోమనికుంట కిందగల ‘ఉష్కె తెప్ప’. దీంతో రైతులకు సాగు నీటి కష్టాలు తీరాయి.

మండలంలోని పాంపల్లి సోమనికుంట కింద గ్రామానికి చెందిన పలువురు రైతుల సాగు భూములు ఉన్నాయి. సాగు నీటి కోసం బోర్లు వేస్తే ఫెయిల్‌ అవుతూ వస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పక్కనే ఉన్న ఉష్కెతెప్ప ప్రాంతంలో బోర్లు వేయగా పుష్కలంగా నీళ్లు పడ్డాయి.ఈ క్రమంలో ఆ ప్రాంత రైతులంటా అక్కడే బోర్లు వేయడం మొదలు పెట్టారు. ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి ఎలాంటి ద్వేషాలు లేకుండా పక్కపక్కనే బోర్లు వేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. ఇలా సుమారు 10 గుంటల విస్తీర్ణంలో 15 బోర్లు వేశారు. వీటికి పైపులైన్లు వేసి పదేళ్లుగా పంటలు సాగు చేస్తున్నారు. గ్రామంలోని సుమారు 120 ఎకరాల వరకు ఈబోర్లతో పంట సాగు అవుతుంది.

400 నుంచి 500 ఫీట్ల లోతులో నీళ్లు

ఇక్కడ గ్రామానికి చెందిన పెరుమండ్లకాడి వెంకటయ్య, అర్జున్‌, శంకరయ్య, లింగమయ్య, కిష్టయ్య, గాదె రాములు, దుర్గయ్య, పోచయ్య, అంబూరి భిక్షం, కొత్తింటి రాములు, గుండు వెంకటయ్య, గుడ్డంల రాములు, వెంకటస్వామి, పాంకిష్టయ్య రైతులకు చెందిన బోరుబావులు ఉన్నాయి. మరికొంత దూరంలో మరికొన్ని బోర్లు ఉన్నాయి. రైతులు ఒక్కో బోరు 600 నుంచి 800 ఫీట్ల లోతు వరకు వేశారు. 400 నుంచి 500 ఫీట్ల లోతుకు వెళ్లాక బోరులో నీళ్లు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మీటరు దూరంలో రెండు బోర్లు, నాలుగు మీటర్ల దూరంలో నాలుగుబోర్లు ఉన్నా ఏ బోరులోనూ నీరు తగ్గడం లేదు. ఇక్కడ సగం మంది రైతులు 500 ఫీట్ల లోతు నుంచి కిలోమీటర్నర దూరం నాలుగు ఇంచుల పైపుతో పంటలకు నీళ్లు పారిస్తున్నారు. ప్రస్తుతం మండు టెండలోనూ బోరు బావుల్లో నీరు తగ్గలేదు.

కిలో మీటరున్నర పైపు లైన్‌



ఉష్కెతెప్ప వద్ద బోరు నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. 800 ఫీట్ల లోతు బోరు వేశా. కిలోమీరున్నర దూరంలో పొలం ఉంది. పొలానికి సాగు నీరు పైపులైన్‌ వేసి పారిస్తున్నాం. ఇక్కడ 5 ఎకరాలు ఉండగా రెండు పంటలకు నీరు అందుతుంది. బోరులో 500 ఫీట్లలోతు నుంచి నీళ్లు తోడి పైపులైన్‌తో నీరు పారిస్తున్నాం. పైపులైన్‌ కోసం రూ.లక్షల్లో ఖర్చు అయినా పంటలు సాగు అవుతుండటంతో ఇబ్బంది లేదు.

- గాదె రాములు, రైతు పాంపల్లి

గ్రామాన్ని ఆదుకుంటుంది



ఉష్కెతెప్ప గ్రామాన్ని ఆదుకుంటుంది. నాకు కట్టకింద అర ఎకరం భూమి ఉంది. బోరు లేదు. అయినా యాసంగిలో పైనుంచి వచ్చే వర్షం నీరు, ఇతర రైతుల బోర్ల నుంచి వచ్చే నీటితోనే సాగు చేస్తా. ఇక్కడ బోరు వేస్తే నీళ్లు తప్పక వస్తాయన్న నమ్మకం ఉంది. ఉష్కెతెప్ప వద్ద బోర్లతో ఇంచుమించి ఊరిలోని ఎక్కువ భూమి సాగవుతుంది. చెరువు నీటితో సంబంధం లేకుండా బోర్లు నీళ్లు పోస్తాయి.

- నర్సింలు, రైతు పాంపల్లి